క్లుప్తంగా

వంతెన నిర్మాణ పనులపై ఆరా



వంతెన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని న్యూ అంబేడ్కర్ పెద్దనాలాపై నిర్మిస్తున్న వంతెన(బిడ్జి) పనులపై జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వంతెన నిర్మాణ పనులను అధికారులతో కలిసి మంగళవారం పర్యవేక్షించారు. వర్షాకాలం వచ్చేలోపు 5 బిడ్జిలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ లింగారావు ఉన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకుడి అరెస్టు



సయ్యద్ జావెద్

ఉప్పల్: పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన యువకుడిని ఉప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. సోమవారం రామంతాపూర్ ఆనందనగర్‌లో గొడవ జరుగుతుందన్న సమాచారంతో ఘటన స్థలానికి చేరుకున్న పెట్రోలింగ్ పోలీసులపై స్థానికంగా ఉండే యువకుడు సయ్యద్ జావెద్(28) దుర్భాషలాడటంతో పాటు న్యూసెన్స్ క్రియేట్ చేస్తూ పోలీసు విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించారు.

పార్కు స్థలం కాపాడాలంటూ దివ్యాంగుల ధర్నా



మేడిపల్లి: కబ్జా కాకుండా పార్కు స్థలాన్ని కాపాడాలంటూ క్రాంతికాలనీలో నివాసముండే దివ్యాంగులు మంగళవారం ధర్నాకు దిగారు. వివరాలు.. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి మేడిపల్లి క్రాంతికాలనీ చెందిన సుమారు 50 చదరపు గజాల స్థలంలో కొన్నేళ్లుగా పండగలు, ఇతర కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. కొంతమంది కబ్జాదారుల కన్ను ఆ స్థలంపై పడిందని, గతంలో నిర్మాణాలు చేపట్టినప్పటికీ కాలనీవాసుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు రెండుసార్లు నేలమట్టం చేశారు. అయినా కబ్జాదారులు రాత్రికి రాత్రే నిర్మాణం చేపట్టారు. ఈ విషయంపై అధికారులు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దివ్యాంగులు వెంకటరమణ, బుచ్చయ్య, యాదగిరి, శ్రీహరి, పిచ్చిరెడ్డి, నాయకులు పంగ ప్రణయ్, శేషగిరిరావు, సంతోష్, పంగ రాజు, మనోజ్, భాగ్యమ్మ, మంగమ్మ, లక్ష్మమ్మ ఉన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



ఇంటింటి ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నేతలు

బోడుప్పల్: సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం కొనసాగిస్తామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం 6, 18వ డివిజన్‌ల్లో చేపట్టిన హాత్ సే హాత్ జోడో యాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో అభివృద్ధి జరగకపోగా, అప్పులు మాత్రం మిగిలాయన్నారు. అమరుల త్యాగాలు, స్వరాష్ట్ర అభివృద్ధి, నిరుద్యోగుల ఆకాంక్షలు నెరవేరాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోగుల నర్సింహారెడ్డి, తోటకూర అజయ్ యాదవ్, బొమ్మక్ కళ్యాణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కొత్త ప్రభాకర్‌గౌడ్, నియోజకవర్గ బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిశోర్‌గౌడ్, నేతలు వెంకటేశ్‌గుప్త, పోగుల దిలీప్ రెడ్డి, పోగుల వీరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ వస్తేనే సంక్షేమానికి పెద్దపీట



మల్లాపూర్: కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చడమే కాకుండా సంక్షేమానికే పెద్దపీట వేస్తామని ఉప్పల్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. నాచారం డివిజన్ పరిధిలో డివిజన్ అధ్యక్షుడు వీఎస్ ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్రను మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రతినిధులు శివారెడ్డి, ఎండీ తోఫిక్, మాజీ కౌన్సిలర్లు కృష్ణారెడ్డి, రాంరెడ్డి, కృష్ణ ముదిరాజ్, రాఘవరెడ్డి, నెమలికొండ సునీల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురపాలికల్లో అవిశ్వాస జ్వాలలు



నోటీసులిచ్చినా.. కదలిక లేకపోవడంతో కలెక్టరేట్‌కు అసమ్మతి వాదుల పరుగులు

- ఆదేశాల కోసం జిల్లా అధికార యంత్రాంగం ఎదురుచూపులు
- గడువులోగా చర్యలు లేకుంటే న్యాయ స్థానాన్ని ఆశ్రయించేందుకూ సిద్ధం

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని పురపాలికల్లో అవిశ్వాస జ్వాలలు ఎగిసి పడుతున్నాయి. మూడు పురపాలక సంఘాల్లో మేయరు, చైర్మన్లపై అవిశ్వాసానికి సంబంధించిన నోటీసులు కలెక్టరేట్‌లో సమర్పించి దాదాపు 24 రోజులు గడుస్తున్నా.. అధికార యంత్రాంగం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంపై అసమ్మతి వాదులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. తమ నోటీసులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారో తెలుసుకునేందుకు సోమవారం కలెక్టరేట్‌కు తరలివెళ్లిన జవహర్‌నగర్, దమ్మాయిగూడ, మేడ్చల్ పురపాలక సంఘాలకు చెందిన అసమ్మతి వాదులు జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ ఆగస్త్యను కలిశారు. అవిశ్వాస తీర్మానంపై నోటీసులిచ్చినప్పటికీ స్పందన లేకపోవడంపై అసంతృప్తిని వ్యక్తం చేసిన అసమ్మతి వాదులు న్యాయస్థాన్ని ఆశ్రయించటానికి సిద్ధమవుతామని పేర్కొన్నట్లు తెలుస్తోంది.

స్పందన లేకపోవడంతో నిరసన...

జవహర్‌నగర్ నగర పాలక సంస్థ మేయరు కావ్యపై అవిశ్వాస తీర్మానంపై నోటీసులు ఇచ్చి దాదాపు 24 రోజులు అవుతున్నా.. స్పందన లేకపోవడంపై అసమ్మతి కార్పొరేటర్లు నిరసన ప్రదర్శిస్తున్నారు. ఇదే పరిస్థితి దమ్మాయిగూడ, మేడ్చల్ పురపాలక సంఘాల్లోని అసమ్మతి వాదుల్లో నెలకొంది. జిల్లా అధికారులు మాత్రం అవిశ్వాస తీర్మానాల నోటీసులకు సంబంధించిన అంశాన్ని రాష్ట్ర మున్సిపల్ అధికారులు నివేదించామని, వారి ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నట్లు పేర్కొంటున్నట్లు వారు (బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు) పేర్కొంటున్నారు.

ప్రస్తుతం మూడేళ్ల గడువు మాత్రమే...

పురపాలక సంఘాల్లో అవిశ్వాస నోటీసు ఇవ్వడానికి (మున్సిపల్ చట్టం ప్రకారం) ప్రస్తుతం మూడేళ్ల గడువు ఉంది. దీనిని నాలుగేళ్లకు పెంచాలంటూ గతంలో జరిగిన శాసనసభ సమావేశాల్లోనే సవరణ బిల్లును ప్రతిపాదించి ఆమోదించారు. ఆ తర్వాత గవర్నర్ సంతకానికి పంపగా, ప్రస్తుతం పెండింగ్‌లో ఉంది. ఇదిలా ఉండగా.. జిల్లాలో మాత్రం మంత్రితో సహా పలువురు బీఆర్‌ఎస్ నేతలు శాసనసభ ప్రతిపాదిత బిల్లుపై గవర్నర్ త్వరలో సంతకం పెట్టిస్తారని, అవిశ్వాసాల పేరిట ఎంత ప్రయత్నించినా ఫలితం ఉండదంటూ.. వ్యతిరేక శిబిరాల్లో ఉన్న డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లకు నచ్చచెబుతున్నట్లు తెలుస్తోంది. అలాగే ఎవరైనా అవిశ్వాసం నోటీసు ఇస్తే ఆ పూర్తి వివరాలను ప్రభుత్వానికి పంపాలని ఇప్పటికే జిల్లా యంత్రాంగానికి మౌఖిక ఆదేశాలు ఇచ్చినట్లు తెలుస్తోంది. దీంతో అవిశ్వాస నోటీసులు ఇచ్చిన పాలకవర్గాన్ని సమావేశ పరిచేలా కలెక్టరు తేదీ ప్రకటించే అవకాశం ఉండదని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, మేయర్లు, చైర్మన్లు ప్రచారం చేసుకుంటున్నారు. ప్రస్తుతం పురపాలికల్లో మేయరు, డిప్యూటీ మేయరు, చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాల్లో ఉన్న వారు కూడా ఇవే అంశాలను పరిగణలోకి తీసుకుంటూ.. తమకేం కాదనే ధీమాలో ఉన్నారు. మరికొందరు అయితే ముందు జాగ్రత్తగా అవసరమైన సభ్యుల మద్దతు కూడగట్టుకునే పనిలో నిమగ్నం కావడంతో పాటు మచ్చిక చేసుకునేందుకు ఆఫర్లు కూడా ప్రకటించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

అవిశ్వాసంపై నోటీసులిలా..

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో జవహర్‌నగర్ నగరపాలక సంస్థ మేయర్ మేకల కావ్యపై అదే పార్టీకి చెందిన 20 మంది అసమ్మతి కార్పొరేటర్లు గత నెల 31న జిల్లా కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు అందజేశారు. అలాగే ఈ నెల 4న మళ్లీ కలెక్టరేట్‌లో మరో నోటీసును వారు అందజేశారు.
- మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ మర్రి దీపికపై కూడా బీఆర్‌ఎస్‌కు చెందిన 15 మంది అసమ్మతి కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానానికి సంబంధించిన నోటీసు కలెక్టరేట్‌లో సమర్పించారు.
- దమ్మాయిగూడ మున్సిపల్ చైర్మన్ ప్రణీతపై కూడా అదే పార్టీకి చెందిన 11 మంది అసమ్మతి కౌన్సిలర్లతో సహా ముగ్గురు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసును కలెక్టర్‌కు అందజేశారు.
- ఈ నోటీసుల్లో తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్–2019 సెక్షన్ 37 అనుసరించి నో కాన్ఫిడెన్స్ మోషన్ పిటిషన్ పురపాలక సంఘాల్లో మేయర్/చైర్మన్ సమర్పిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

కలెక్టరేట్ చుట్టూ అసమ్మతి వాదుల ప్రదక్షిణలు..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ పురపాలక సంఘాల్లోని అసమ్మతి వాదులు, అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ప్రదక్షిణలు చేస్తున్నారు. దీనికి పురపాలక సంఘాల్లోని డిప్యూటీ మేయరు, చైర్మన్లు నాయకత్వం వహిస్తున్నారు. మేయరు, చైర్మన్ అధికార పీఠంపై గురి పెట్టిన పలువురు కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా అసమ్మతి వాదులకు చేదోడు వాదోడుగా నిలవడంతో పాటు వారిని మచ్చిక చేసుకునేందుకు పలు ఆఫర్లు సైతం ఇస్తున్నట్లు తెలుస్తోంది. అవిశ్వాసంపై నోటీసులు అందజేసిన 30 రోజుల్లో కౌన్సిల్ పాలకవర్గం సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈలోగా అవిశ్వాస నోటీసు పత్రంపై సభ్యులు చేసిన సంతకాలను సరైనవేనా.. కావా..? అనే అంశాలను సరి చూసుకోవడంతో పాటు సంఖ్యా పరంగా సభ్యులంతా ఉన్నారా? లేరా? అనే విషయాలను పరిగణలోని తీసుకోవాల్సి ఉంది. వీటన్నింటిని చెక్ చేయాలంటూ.. సంబంధిత పురపాలక కమిషనర్లకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా అధికారులు మళ్లీ నిలిపివేయాలని మౌఖిక ఆదేశాలు ఇవ్వడంపై కార్పొరేటర్లు, కౌన్సిర్లలో చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలోనే అసమ్మతి వాదులైన డిప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు సిద్ధమవుతున్నారు.

అందరి సహకారంతోనే వందశాతం స్వచ్ఛత



స్వచ్ఛత ర్యాలీలో కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ప్రతి ఒక్కరిలో సామాజిక దృక్పథం ఉన్నప్పుడే వందశాతం స్వచ్ఛత సాధ్యమవుతుందని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్, శాంతినగర్ కాలనీల్లో మంగళవారం విద్యార్థులతో కలిసి స్వచ్ఛత ర్యాలీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చెత్తను ఆటోల్లో వేసేప్పుడు తడి పొడి చెత్తను వేరు చేయాలని సూచించారు. ఎవరికి వారుగా శుభ్రత పాటించి పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలన్నారు. ఆ దిశగా అందరిలో మార్పు వచ్చినప్పుడే శుభ్రత సాధ్యమవుతుందన్నారు. సమష్టిగా కృషిచేసి డివిజన్‌లో వందశాతం శుభ్రత సాధించి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ డాక్టర్ స్వప్నరెడ్డి, రాంకీ సంస్థ ప్రతినిధులు అమానుల్లాఖాన్, వాటర్ వర్క్స్ ఏఈ వేణుగోపాల్, నాగరాజు, శ్రీను స్థానిక నేతలు మధు, రాకేష్, వేణు, ప్రసాద్, శేఖర్‌గౌడ్, నరేందర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

అబాకస్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



రామంతాపూర్: శ్రీచైతన్య పాఠశాలలో మంగళవారం నల్లకుంట జోన్‌కు చెందిన శ్రీచైతన్య విద్యార్థులకు నిర్వహించిన అబాకస్ స్టోరీ టెల్లింగ్ పోటీల్లో రామంతాపూర్, మేడిపల్లి, తార్నాక విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రామంతాపూర్ ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మీ, మేడిపల్లి ప్రిన్సిపల్ దయాకర్, తార్నాక ప్రిన్సిపల్ ప్రశాంతి పాల్గొన్నారు.

మోదీ సంక్షేమ పథకాలు భేష్

మౌలాలి: మౌలాలి డివిజన్ ఎస్‌పీనగర్‌లో మంగళవారం శక్తి కేంద్రం ఇన్‌చార్జి ఫణీంద్రరావు ఆధ్వర్యంలో ప్రజాగోస– బీజేపీ భరోసా, స్ట్రీట్‌కార్నర్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ హాజరై కాలనీవాసులతో చర్చించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి పనులను ఆమె వివరించారు. బీజేపీ నాయకులు చంద్రశేఖర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



మౌలాలి డివిజన్ ఎస్‌పీనగర్‌లో..

బీజేపీతోనే దేశాభివృద్ధి

మల్లాపూర్: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని మేడ్చల్ జిల్లా బీజేపీ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు, సమన్వయకర్త రాగిరి మోహన్‌రెడ్డి అన్నారు. నాచారం రాఘవేంద్రనగర్ కాలనీలో శక్తికేంద్ర ఇన్‌చార్జి రాజిరెడ్డి ఆధ్వర్యంలో ప్రజా గోస–బీజేపీ భరోసా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు మల్కా ప్రకాష్, నాయకులు అంపాల పద్మారెడ్డి, అనితారెడ్డి, అన్వర్, నవీన్, చంద్రమౌళి, రవికాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, భూపతి యాదవ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రోరైల్‌తో రేడియో సిటీ భాగస్వామ్యం

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ రేడియో నెట్‌వర్క్, రేడియో సిటీ హైదరాబాద్ మెట్రో రైల్(హెచ్‌ఎంఆర్)తో బ్రాండింగ్ కోసం ఒప్పందం చేసుకుంది. ఈ విషయాన్ని నగరానికి చెందిన రేడియో సిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ ఒప్పందం ప్రకారం.. 2 నుంచి 3 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణించే సికింద్రాబాద్ ఈస్ట్, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, లక్డీకాపూల్, నాంపల్లి, జేబీఎస్, ఎల్‌బీనగర్, ఉప్పల్, రాయ్‌దుర్గ్, ఎంజీబీఎస్ వంటి స్టేషన్లలో రేడియో సిటీ ప్రత్యేక ప్రచారం నిర్వహించనుందని, ఇది పరస్పరం ఉపయుక్తంగా ఉండనుందని వివరించారు.

వ్యర్థాలను తొలగించి దుర్వాసన రాకుండా చర్యలు



అధికారులతో చిన్న చెరువు పరిశీలిస్తున్న ఉప్పల్ డీసీ అరుణకుమారి

రామంతాపూర్: చిన్న చెరువులో వ్యర్థాలు పేరుకుపోయి దుర్వాసన వస్తోందని స్థానికుల ఫిర్యాదు మేరకు జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ అరుణకుమారి అధికారులతో కలిసి మంగళవారం చిన్న చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంతో పాటు చిన్న చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతుందని ఆమె అన్నారు. చెరువు నుంచి వచ్చే దుర్వాసన అరికట్టేందుకు చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తను వెంటనే తొలగింపజేస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు నాగేందర్, చందన, సుదర్శన్, నాగమణి, బీజేపీ డివిజన్ అధ్యక్షులు బండారు వెంకట్రావు, ఫిషరీస్ కో–ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ మోహనకృష్ణ, ప్రజాసంకల్పం కిట్టు తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేస్తాం



వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం బోడుప్పల్ మేయర్ సామల బుచ్చిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15, 16 డివిజన్‌ల్లో రూ.75 లక్షలతో చేపట్టనున్న బీటీ రోడ్డు పనులను త్వరితిగతిన పూర్తి చేస్తామన్నారు. నూతనంగా రోడ్డు వేసే చోట నల్లా కనెక్షన్లు లేని ఇళ్లకు డమ్మీ కనెక్షన్లు ఇస్తామన్నారు. డ్రైనేజీ లేక ఇబ్బందులు పడుతున్న చోట ఎస్టిమేషన్ వేసి పనులు చేపడతామన్నారు. అనంతరం రూ.7 కోట్లతో చేపడుతున్న వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను పరిశీలించారు. ఈ పనులను త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. 3వ డివిజన్ పరిధిలోని ఎంఎల్‌ఆర్ కాలనీలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈఈ శారద, వాటర్ వర్క్స్ డీజీఎం నిర్మల, మేనేజర్ మమత, 3వ డివిజన్ కార్పొరేటర్ కొత్త చందర్‌గౌడ్, టెలిఫోన్ కాలనీ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, దినేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

మల్కాజిగిరి: జీహెచ్‌ఎంసీ ట్రాన్స్‌పోర్ట్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ట్రేడ్ యూనియన్ సెల్ నాయకులు గ్రేటర్ కమిషనర్ లోకేష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు భగవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సంజీవ మాట్లాడుతూ దశాబ్దాలుగా పనిచేస్తున్నామని, ప్రభుత్వం శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కొత్త వాహనాల కొనుగోలుతో పాటు, పాత వాహనాలకు ఫిట్‌నెస్ చేయించాలన్నారు. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. అంజయ్య, వెంకటేష్, ఎల్లయ్య ఉన్నారు.



అరటి పండ్లతో అలంకరణ



మారుతీనగర్ ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మూల విరాట్‌కు అభిషేకం, సింధూర అలంకరణ, 86 డజన్ల అరటిపండ్లతో పూజా కార్యక్రమాన్ని అర్చకులు శ్యామ్ ప్రసాద్ శర్మ నిర్వహించారు.
–మల్కాజిగిరి

బెస్ట్ స్వచ్ఛ ఆటో డ్రైవర్ ఫకీరప్పకు బహుమతి

మల్లాపూర్: ప్రతిరోజూ క్రమం తప్పకుండా ఇళ్లలోంచి చెత్తను సేకరిస్తున్నారో వారికి జీహెచ్ఎంసీ, రాంకీ సంస్థ ఆధ్వర్యంలో విలువైన ప్రోత్సాహక బహుమతులను ప్రతినెలా అందజేస్తామని కాప్రా సర్కిల్ ఏఎంహెచ్‌వో స్వప్నరెడ్డి అన్నారు. మల్లాపూర్ చెత్త డంపింగ్ యార్డు వద్ద ఫకీరప్ప బెస్ట్ స్వచ్ఛ ఆటో డ్రైవర్ ఆనంద్‌కు మంగళవారం ఏఎంహెచ్‌వో చేతులమీదుగా బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంహెచ్‌వో మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆటో డ్రైవర్లను ప్రోత్సహించేందుకు రాంకీ సంస్థ ముందుకు రావడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో రాంకీ సంస్థ ఎల్‌బీనగర్ జోన్ హెడ్ రవి నాయర్, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు, సర్కిల్ ఇన్‌చార్జి అమానుల్లాఖాన్, నవీన్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, స్వచ్ఛ ఆటో యూనియన్ ప్రెసిడెంట్ చెక్క శ్రీను, సూపర్‌వైజర్ గీతాంజలి, ఎస్‌ఎఫ్‌ఏలు, జవాన్లు, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



ఫకీరప్పకు బహుమతి అందజేస్తున్న ఏఎంహెచ్‌వో స్వప్నరెడ్డి

లోప్రెషర్ సమస్యకు పరిష్కారం



కాలనీల్లో పర్యటిస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: డివిజన్ పరిధిలోని శుభోదయనగర్, సోనియాగాంధీనగర్ కాలనీల్లో తాగునీటి లోప్రెషర్ సమస్యకు రెండు రోజుల్లో పరిష్కారం చూపాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అధికారులను ఆదేశించారు. కాలనీల్లో పర్యటించిన ఆమె మంగళవారం స్థానిక సమస్యలపై ఆరా తీశారు. తాగునీటి లోప్రెషర్ సమస్యను ప్రస్తావించగా సంబంధిత అధికారులతో ఆమె మాట్లాడారు. సమస్య పరిష్కరించేలోగా ప్రత్యామ్నాయంగా ఉన్న మరో లైన్‌కు కనెక్షన్ ఇవ్వాలని సూచించారు. అలాగే కాలనీలో రాత్రి పోలీసు పెట్రోలింగ్ ఏర్పాటు, వీధి దీపాలు, పెన్షన్ల సమస్యలను ఆమెకు వివరించగా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, కనక రాజుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, శ్రీకాంత్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

నివాళి

కుషాయిగూడ: అనారోగ్యంతో మృతిచెందిన చర్లపల్లి డివిజన్ వీఎస్‌రెడ్డినగర్ కాలనీకి చెందిన వెంకటరాంరెడ్డి కుమారుడు సాయిసంతోష్‌రెడ్డి(17) మృతదేహానికి గ్రేటర్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి నివాళులర్పించారు. చెన్నైలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సాయిసంతోష్ కుటుంబ సభ్యులను వారు ఓదార్చి ధైర్యం చెప్పారు. స్థానిక నేతలు సప్పిడి శ్రీనివాస్‌రెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు

భౌభౌ.. కేర్‌ఫుల్..



వీధుల్లో తిరుగుతున్న కుక్కలు

రామంతాపూర్: గుంపులు గుంపులుగా కుక్కలు వీధుల్లో తిరుగుతుంటే ప్రజలు భయంతో అటువైపు వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు వెంటపడి కరుస్తున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల అంబర్‌పేట చే నెంబర్ చౌరస్తాలోని ఓ వీధిలో వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల బాలుడు తీవ్రంగా గాయపడి ప్రాణాలు వదిలిన హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. నడుచుకుంటూ వెళ్తున్న చిన్నారిపై కుక్కలు దాడి చేయడంతో మృతి చెందిన ఘటన ఆవేదనకు గురిచేసింది. ఈ ఘటన అంబర్‌పేటలో జరగడంతో అతి దగ్గరగా ఉన్న రామంతాపూర్ ప్రజలు షాక్‌కు గురయ్యారు.

అర్ధరాత్రి వాహనదారులపై దాడులు

రామంతాపూర్ ప్రధాన రహదారి విశాల్ మార్ట్ నుంచి పాలిటెక్నికల్ కళాశాలకు వెళ్లే దారిలో రాత్రి వేళలో కుక్కలు గుంపులుగా వాహనదారులపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొన్ని జీహెచ్‌ఎంసీ సర్కిళ్ల నుంచి తీసుకొచ్చి మూసీనది వద్ద కుక్కలను వదులుతుండటంతో మూసీ పరివాహక కాలనీలు, బస్తీలైన రామ్‌రెడ్డినగర్, వెంకట్‌రెడ్డినగర్, వాసవీనగర్, రామ్ శంకర్‌నగర్, శ్రీనగర్ కాలనీ, కేసీఆర్‌నగర్, శ్రీరామ కాలనీ, టీవీ కాలనీల్లో కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.



అధికారులూ.. స్పందించాలి

గోకుల్‌నగర్‌లోని యాదవ సంఘం నుంచి ఆర్టీసీ కాలనీ వెంకటేశ్వర స్వామి దేవాలయం వరకు వీధి కుక్కలు ఉదయం, రాత్రి వేళల్లో గుంపులు గుంపులుగా తిరుగుతూ వాహనాలకు, పాదచారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఓల్డ్ రామంతాపూర్ చిన్న చెరువు సమీపంలో ఉన్న భరత్‌నగర్, రాజేంద్రనగర్, నేతాజీనగర్, ఇందిరానగర్, నెహ్రూనగర్‌తో పాటు సత్యనారాయణ స్వామి దేవాలయం వద్ద వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. వీధి కుక్కల గురించి ఉప్పల్ సర్కిల్‌లో అధికారులకు సమాచారం అందించినప్పుడు మాత్రమే వచ్చి కుక్కలను పట్టుకెళ్లి వాటికి యాంటీ రేబీస్ ఇంజక్షన్లు ఇచ్చి మళ్లీ అక్కడే వదిలేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

న్యూసెన్స్ కేసులో నలుగురికి జైలు



మేడిపల్లి: అతిగా మద్యం తాగి రోడ్డుపై న్యూసెన్స్ చేసిన నలుగురిని మేడిపల్లి పోలీసులు మొదటి స్పెషల్ మెట్రోమెజిస్ట్రేట్ ఎల్బీనగర్ కోర్టులో హాజరుపర్చగా వారికి వారం రోజుల జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.550 జరిమానా విధించింది. పోలీసుల వివరాల ప్రకారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో బోడుప్పల్‌లోని శివా వైన్స్ వద్ద నలుగురు వ్యక్తులు అబ్దుల్ మాజీద్‌ఖాన్(26), గువ్వల ప్రశాంత్ కుమార్(24), మజ్జిగ సాయిచందర్(25), ఎలుక సాయిరాం(24) అతిగా మద్యం తాగి రోడ్డుపై న్యూసెన్స్ చేస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ చేసి ఎల్బీనగర్ కోర్టులో హాజరుపర్చగా వారం రోజుల జైలు, రూ.550 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మేడిపల్లి సీఐ గోవర్ధనగిరి మాట్లాడుతూ.. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.